# నక్క తీర్పు

అది గ్రామమో, పట్టణమో, రాజ్యమో, చెప్పడం చాలాకష్టం. కాబట్టి - అనగా అనగా అదేదో అనుకుందాం. అది ఏమైతే యేంగాని దానికి రాజంతటి వాడుగా శ్రీ శ్రీరాములుంగారుమాత్రం వున్నాడు. అక్కడి ప్రజలకంతా ఒకప్పుడు దేవుడి తర్వాత దేవుడం తటివాడు. ఇప్పుడు నాయకుడుగా చెల్లుబాటౌతున్నాడు. ఐతే అంతటి శ్రీరాములుంగారికి స్వంత భూముల్లేకుండా వుంటాయా? ఒకవేళ లేవే అనుకోండి. అనుకోడం ఎందుకూ? తన పొలంగట్లు తానే యెరగనన్ని భూము లదివరకే వున్నాయి. పైగా బాధితుడుగా కొందరు పేద వాళ్లు సాగుచేసుకునే భూములు క్రొత్తగావచ్చి కలి శాయికూడాను.

ఐతే అసలువిషయం యేమిటంటే - ఈయన మాగాణీ భూముల్లో చాలా పెద్దపెద్ద కుప్పలు పడ్డాయి. ఆసవాకోటి కుప్పల్లో ఏదోఒక కుప్ప ప్రక్కనే, ఎవడో ఒకడు, తన అర ఎకరంలో పండిన పైరూ తెచ్చి పోగు పెట్టుకున్నాడు.

'ముండాకొడుకు!' ఆయన కుప్పతోపాటే వుంటే కుప్పకావలి తప్పుతుందని 'స్వార్థం'గా ఆలోచిం

చాడు. నిజంగానే ఈస్వార్థుడికి కుప్పకావలి తప్పింది.

సరే. కొన్నాళ్లు గడిచాయి. పెద్ద హంగామాతో శ్రీరాములుంగారి కుప్పకాస్తా నూర్పిడై పోయింది. దానితోపాటే ఆప్రక్కనేవున్న యీస్వార్థుడి కుప్పకూడా—

'కుప్పకావలి తప్పుతుంది' అనే స్వార్థంలోపడ్డ ఈపేద ముండావాడికి కుప్పకావలి ఒకటేకాదు. నూర్పిడి ఖర్చూ, ఆగింజలు తినేబాధా, అన్నీ – అన్నీ తప్పిపోయాయి.

ఆ తర్వాత ఎప్పటికో–తీరికచేసుకుని వచ్చాడు పేదవాడు. కుప్పను చూచుకున్నాడు. కుప్పను ఎలా చూచుకుంటాడు? కుప్ప వుండాల్సినచోటు చూచుకున్నాడు. 'లబోదిబో' మన్నాడు. శ్రీరాములుంగారి పాదాలమీద రెక్కలు కట్టుకుని వ్రాలాడు. ఏడ్చాడు. మొత్తుకున్నాడు.

శ్రీరాములుంగారికి అంతా అవగతమై పోయింది.

"ఓరి పిచ్చనాగన్నా! మన పెద్దకుప్ప పిల్లని పెడితే అది నీదెలా అవుతుందిరా!?" అన్నాడు శ్రీరాములుంగారు. భగవద్గీతలో నిష్కామయోగం చదువుతూ–యింటికిచేరిన ధాన్యం తిరిగి యివ్వడానికి యిష్టం లేకనేమో!

"మరి నాకుప్ప...?"

"ఏ దొంగ ముండాకొడుకులు కట్టుకుపోయారో."

ఈ పిచ్చినాగన్న నివ్వెరపోయాడు. ఇంకా గట్టిగా ఏడ్చాడు. కాని శ్రీరాములుంగారి అంతటివాడు చెబుతున్నా గూడా నమ్మకపోతేఎలా? పైగా భగవద్గీత పట్టుకుని చెబుతోంటే.

శ్రీరాములుంగారికి కోపంవచ్చింది. బర బరా బయటికి ఈడ్పించాడు.

పిచ్చినాగన్న వూరుకోలేదు. ఊళ్లో పెద్దలుగా చలామణీఅయ్యే ప్రతివాళ్ళదగ్గరికీ పోయాడు. మొర్ర పెట్టుకున్నాడు. కాని ...... 'శ్రీరాములుంగారి కుప్ప పిల్లని పెట్టలేద' ని వాళ్లు మాత్రం ఎలా అనగలరూ? ఐనా మెల్లగా హెచ్చరించి చూచారు. ఏదో కొద్ది మందే –

"ఏటా మనకుప్పలు పిల్లల్ని పెడుతుంటాయి. ఈ ఏడుకూడా అన్నీ పెట్టాయి. అలాంటప్పుడు ఇంత పెద్దకుప్ప పిల్లని పెట్టలేదంటే నమ్మడం ఎలా?" చెప్పాడు. శ్రీరాములుంగారు అతి ప్రశాంతంగా –

పెద్దమనిషిమీద ఇలాంటి నిందవేసినందుకు ఆ 'స్వార్థుడికి' వూళ్ళో చోటులేకుండా పోయింది.

ఇక ఆ పేదవాడు ఊళ్ళవెంట పడ్డాడు. పిచ్చి నాగన్న గదూ! ప్రతి ఊళ్లోనూ ఏడ్చాడు. అలా వెళ్ళీ వెళ్ళీ తన ఏడ్పుకు ఎదురు చెప్పకుండా వినే అరణ్యాలకు వెళ్ళిపోయాడు. చీమలుదూరని చిట్టడవీ, కాకులుదూరని కారడవీ అన్నిటిలోనూ అలాగా ఏడ్చుకుంటూ తిరిగాడు.

అలా ఏడ్వగా ఏడ్వగా, ఏడుస్తూ తిరగగా తిరగగా—ఓ ముసలినక్క ఎదురయింది. ఇతగాడి ఏడ్పంతా చాలా ఓపిగ్గా విన్నది. "ఓయి పిచ్చినాగన్నా ! రా. నా వెంటరా! తియ్యి. నీ ఊరికి దారితియ్యి." అన్నది.

పిచ్చినాగన్నగదూ! దారి తీశాడు.

—ఈవార్త ఊరంతా గప్పున పొక్కింది. అలా పొక్కి అలాపొక్కి శ్రీరాములుంగారి చెవిదాకా కూడా ఎక్కింది. ఆయనకి కోపమూ ఎక్కింది. ఐనా ఒక పాళాన అణచుకున్నాడు. 'ప్రజాస్వామ్య' పద్ధతి ప్రకారమే పరిష్కరించాలనుకున్నాడు,

అక్కడి జనానీకంతా ఆ విడ్డూరం చూడాలనీ వుంది; శ్రీరాములుంగారి కెక్కడకోపంవస్తుందో అనీ వుంది.

"ఆ నక్క చెప్పేన్యాయం కూడా వినడమే న్యాయం" అన్నాడు శ్రీరాములుంగారు. ప్రజాస్వామిక వాదిగదూ !

ఊరు వూరంతా పొర్లగిలబడింది. ఊరిబయట కొచ్చి పోగుబడింది.

ఊరిబయట జంబూకంగారు కొలువుతీర్చి కూర్చున్నారు. ఉలకడంలేదు. పలకడంలేదు. పైగా అందరికీ జల్లితోకమాత్రం చూపుతూ, తూర్పుగా తిరిగి కూర్చొంది.

జనం అలా ఎంతకాలం అని కూర్చోగలరు?

ఓ పెద్దమనిషి లేచాడు. ‘‘జంబూకం! ఓ జంబూకం! ఏదో తీర్పు చెబుతానని తెగబడి వచ్చావటగా! అలా తూర్పుకు తిరిగి దణ్ణం పెడుతున్నావేం?’’ అడిగాడు.

జంబూకం ఏమీ తటపటాయించలేదు.

‘‘తూర్పు సముద్రం తగలబడిపోతోంటే చూస్తున్నానండీ’’ అన్నది. అంతా ఆశ్చర్యపోయారు.

‘‘సముద్రమేమిటి? తగలబడటమేమిటి?’’ అన్నారు. ఒక్కసారిగా—

‘‘అవేం? ఆమంటలకి తట్టుకోలేక చేపలన్నీ చెట్లెక్కుతుంటేనూ!’’ అన్నది జంబూకం.

‘‘చేపలెక్కడన్నా చెట్లెక్కుతాయా?’’ అన్నారు జనం.

"కుప్ప ఎక్కడన్నా పిల్లల్ని పెడుతుందా?" అడిగింది జంబూకం—

"పెట్టదు. పెట్టదు" అన్నారు జనమంతా. వెనుక ముందూ చూడకుండానే—

ఒకరిద్దరు పెద్దలుమాత్రం గుక్కతిరక్క గుటకలు మింగారు.

"ఏమిటీ? కుప్ప పిల్లల్ని పెట్టదూ?" శ్రీరాములుంగారికి కోపంవచ్చింది. అరికాలిమంట నెత్తికెక్కింది.

"ఈ వెధవ నక్క నా రాజ్యంలో శాంతికి భంగం కలుగజేసింది. లేకపోతే ఈ సామాన్యజనం 'కుప్ప పిల్లల్ని పెట్టదు.' అని అలా ఎలా అనగలుగుతారు? ఎన్ని గుండెలతో అంటారు? శాంతి భంగమైపోయింది." 'శాంతిరక్షణకోసం నక్కని అరెస్టుచెయ్యాలి' శాసించాడు శ్రీరాములుంగారు.

కాని...ఏదీ నక్కా? నక్కా లేదు. నాగలోకమూ లేదు. శాసనం చలామణీ కానూలేదు. యింతవరకూ ఎవ్వరికీ కన్పించనూ లేదు.

శ్రీరాములుంగారికి మాత్రం అప్పుడప్పుడూ దాని జల్లితోక కలలో కన్పిస్తూ వుంటుందట.